సాక్షి
గుంటూరు
సోమవారం ၊ 25 ၊ నవంబర్ ၊ 2024




గుడికి పంచలోహ విగ్రహాలు

భట్టిప్రోలు: కొత్తపేట కోదండరామస్వామి గుడికి గొట్టుముక్కల వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆదివారం పంచలోహ విగ్రహాలను అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో 43.35 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 3000 క్యూసెక్కులు వస్తుండగా దిగువకు 2000 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 585.490 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు

గుంటూరు వెస్ట్: కళాశాల ఫీజులు చెల్లించ లేదని విద్యార్థులకు యాజమాన్యాలు ఇబ్బందులు కలిగించకూడదని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదివారం పేర్కొన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ జరగని కారణంగా హాల్ టిక్కెట్లు ఇవ్వకపోవడం, ప్రాక్టికల్స్, తరగతులకు రానివ్వకపోవడం వంటివి చేయొద్దని తెలిపారు. కొన్ని యాజమాన్యాలు ఫీజు రీఎంబర్స్‌మెంట్ రాలేదని విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని కళాశాలలకు దీనిపై నిర్దిష్టమైన సూచనలు జారీ చేయాలన్నారు.

యూటీఎఫ్ గుంటూరు జిల్లా నూతన కమిటీ ఎన్నిక


రాజశేఖర్‌రావు


కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యు.రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్‌లు ఎన్నికయ్యారు. ఆదివారం ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా జిల్లా శాఖకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షునిగా పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా జి.వెంకటేశ్వర్లు, వై.నాగమణి, కోశాధికారిగా ఎండీ గయాసుద్దౌలా, కార్యదర్శులుగా సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి. వెంకటేశ్వరరావు, టి.ఆంజనేయులు, ఎం.గోవిందు, కె. కేదార్‌నాథ్, ఎండీ షకీలాబేగం, కె.కామాక్షి, బి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

తిరునాళ్ల జెండా ఆవిష్కరణ



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో పునీత శౌరి వారి తిరునాళ్ల జెండా ప్రతిష్ఠ కార్యక్రమంతో పండుగను ఆదివారం ఫాదర్ పామిశెట్టి బాలస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మొదటి దివ్య బలిపూజలో ఫాదర్ పునీత శౌరి వారు –క్రీస్తురాజుని ప్రకటించుట గురించి భక్తులకు వివరించారు. భక్తులకు శౌరి వారి వస్త్రముతో కూడిన బంగారు ఉంగరంతో ముద్దును అందజేశారు. అనంతరం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శౌరి వారి పుణ్యక్షేత్రం ఫాదర్ మార్నేని దిలీప్ కుమార్, మఠకన్యలు, గుడి పెద్దలు, గ్రామ క్రైస్తవులు భక్తులు పాల్గొన్నారు.

7 నుంచి క్యారమ్స్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్, చిత్తూరు జిల్లా క్యారమ్స్ సంఘం సంయుక్తాధ్వర్యంలో వచ్చే నెల 7, 8వ తేదీల్లో ఏపీ 3వ స్టేట్ ర్యాంకింగ్ క్యారమ్స్ టోర్నమెంట్ ఉంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు పట్టణంలోని రెవెన్యూ భవన్ ప్రాంగణంలో పోటీలు ఉంటాయన్నారు. పురుషులు, మహిళలు, వెటరన్స్ విభాగాల్లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 99511 15678 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి


ఘటనా స్థలిలో మల్లేష్

పట్నంబజారు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో వాటిపై వస్తున్న ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవభారత్‌నగర్‌కు చెందిన దాసరి రమేష్ (65) ఈ నెల 23వ తేదీ రాత్రి 8 గంటలకు రైల్వేస్టేషన్ నుంచి బృందావన్ గార్డెన్స్ మీదుగా తిరిగి వస్తున్నాడు. అదే క్రమంలో కొరిటెపాడుకు చెందిన బి. మల్లేష్ (20) మారుతీనగర్‌లో అయ్యప్ప మాల ధరించిన నేపథ్యంలో భజనకు వెళ్లి ఇంటికి బయలుదేరాడు. అర్ధరాత్రి సమయంలో రింగురోడ్డు వద్ద వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం దాసరి రమేష్‌ను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా జీజీహెచ్‌కు తరలించాలని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో జీజీహెచ్‌కు తరలిస్తుండగా అతడు మృతి చెందాడు. మల్లేష్ ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు సరఫరా.. స్మార్ట్!

విద్యుత్ చార్జీల చెల్లింపు విధానం ప్రీపెయిడ్‌లోకి మారనుంది. ఇక ముందస్తుగా రీచార్జి చేసుకుంటేనే విద్యుత్ సరఫరా ఉంటుంది. బ్యాలెన్స్ అయిపోగానే సరఫరా ఆటోమేటిక్‌గా నిలిచిపోతుంది. ఆ దిశగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ తీసుకొస్తోంది. ఇప్పటికే గుంటూరు నగరంలో అందుబాటులోకి వచ్చేశాయి. తొలి విడతగా వీటిని ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్, పరిశ్రమల్లో ఏర్పాటు చేస్తున్నారు.



జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటరు

- బిల్లుల స్థానంలో ప్రీపెయిడ్ విధానం
- స్మార్ట్ మీటర్లకు విద్యుత్ సంస్థ చర్యలు
- తొలుత ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్, పరిశ్రమల్లో ఏర్పాటు
- ఇప్పటికే గుంటూరులో సుమారు 6,500 వరకు బిగింపు

కొరిటెపాడు(గుంటూరు): గత నెల రోజుల వ్యవధిలో నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్, పరిశ్రమల్లో ప్రయోగాత్మకంగా 6,500 స్మార్ట్ మీటర్లను అమర్చి వాటి పనితీరును పరిశీలిస్తున్నారు. రెండో విడతగా అన్ని చోట్ల వీటిని బిగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఆ తర్వాత గృహ సముదాయాలు, వ్యవసాయానికి కూడా ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు నగరంలో 3.53 లక్షల గృహ, 53 వేల కమర్షియల్, 1,485 పరిశ్రమలకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ నెల వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి వినియోగదారులు మరుసటి నెలలో బిల్లు చెల్లిస్తున్నారు. ప్రతి నెలా మొదటి వారంలో మీటరు రీడర్ బిల్లు తీస్తే చెల్లించేందుకు పదిహేను రోజుల పాటు గడువు ఉంటుంది. ఆ తర్వాత కూడా అపరాధ రుసుంతో చెల్లించేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ విధానంలో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయి విద్యుత్ పంపిణీ సంస్థలపై భారం పడుతోంది.

బ్యాలెన్స్ ఉంటేనే సరఫరా

దీని నుంచి ఉపశమనానికి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దశల వారీగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ సంస్థ సిద్ధమవుతోంది. స్మార్ట్ మీటర్ల విధానంలో వినియోగదారులు ముందుగా రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాలెన్స్ ఉన్నంత వరకు నిర్విరామంగా విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ విధానంలో ఎంత విద్యుత్ వినియోగించామో, ఇంకా ఎంత బ్యాలెన్స్ ఉందో ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను తీసుకురానున్నారు. ఈ యాప్ వినియోగదారులు తమ మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పరిశీలించుకోవచ్చు. నగదు అయిపోయిన వెంటనే మళ్లీ రీచార్జి చేసుకుంటే విద్యుత్ సరఫరా కొనసాగుతుంది. గతంలోలా గడువు లేక వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు పరిష్కరిస్తేనే...

స్మార్ట్ మీటర్లతో అనవసరపు విద్యుత్ వినియోగం తగ్గుతుంది. గ్రామీణ ప్రాంత వినియోగదారులు అవస్థలు పడే అవకాశాలున్నాయి. విద్యుత్తు సంస్థకు మొండి బకాయిల బెడద తప్పుతుంది. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు ఇకపై అధిక బకాయిలు పెండింగ్‌లో ఉంచే అవకాశం ఉండదు. లైన్ల నుంచి విద్యుత్‌ను అక్రమంగా వాడుకునే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ మీటర్ రీడర్లపై పడనుంది. గుంటూరు నగరంలో సుమారు 100 మంది రీడర్స్ పనిచేస్తున్నారు. వారి ఉపాధికి గండి పడనుంది.

లోపాలు లేకుండా బిగించేలా చర్యలు

ప్రస్తుతం ఉన్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ తీసుకొస్తోంది. తొలుత నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, కమర్షియల్, పరిశ్రమల్లో ప్రయోగాత్మకంగా అమర్చాం. ప్రస్తుతం పనితీరు పరిశీలిస్తున్నాం. లోపాలు ఉంటే సరిచేసి, మిగిలిన వాటికీ అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–టి.శ్రీనివాసబాబు, డీఈ, విద్యుత్ శాఖ, గుంటూరు


దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు

హరోం హర... !


- భక్తులతో కిటకిటలాడిన కాకాని శివాలయం
- కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేసిన భక్తులు


స్వామి వారికి విశేష అలంకరణ


కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం కార్తిక మాసం సందర్భంగా వచ్చిన భక్తులతో హరోం హర నామస్మరణతో మార్మోగింది. పెదకాకాని శివాలయంలో తెల్లవారుజామున సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున భక్తులు యజ్ఞాల బావి వద్ద స్నానాలు చేసి, ప్రదక్షిణలు చేశారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ప్రాంగణం కళకళలాడింది. తర్వాత కార్తికదీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. యజ్ఞాల బావి నీటితో పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ కె.బి. శ్రీనివాస్ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. క్యూలైన్లలలో భక్తులకు దాతల సహకారంతో పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, అన్నప్రాసనలు, నామకరణలు, రాహుకేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. ప్రభలతో ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కరోజులో స్వామి వారికి రూ.7,25,000 ఆదాయం లభించినట్లు శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారికి భక్తులు సమర్పించి చీరల వేలంపాట ద్వారా రూ.1,02,350 ఆదాయం చేకూరినట్లు ఆలయ ఉప కకమిషనర్ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 3506 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 252, బ్యాంక్ కెనాల్‌కు 522, తూర్పు కెనాల్‌కు 56, పశ్చిమ కెనాల్‌కు 51, నిజాంపట్నం కాలువకు 196, కొమ్మమూరు కాలువకు 1946 క్యూసెక్కులు విడుదల చేశారు.

తీరం..భక్తజన సంద్రం

పర్యాటకులతో నిండిన సూర్యలంక తీరం

- దాదాపు 2 లక్షల మంది సందడి
- పెద్దసంఖ్యలో వాహనాల్లో రాక
- వన సమారాధనలతో తోటలు కళకళ
- గంటల తరబడి నిలిచిన ట్రాఫిక్
- రద్దీ నియంత్రణకు అష్టకష్టాలు పడిన పోలీసులు
- తీరంలో గస్తీ నిర్వహించిన పోలీసులు, గజ ఈతగాళ్లు


బాపట్ల - సూర్యలంక రోడ్డులో నిలిచిన వాహనాలు

బాపట్లటౌన్: సూర్యలంక సముద్రతీరం ఆదివారం పర్యాటకులతో కిక్కిరిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 2 లక్షల మేర పర్యాటకులు తీరానికి చేరుకోవడంతో తీరం ఒక్కసారిగా జనసంద్రంగా మారింది. మరోవారం రోజుల్లో కార్తికపౌర్ణమి ముగియనుండటంతో పర్యాటకులు, భక్తులు ఆదివారం తీరానికి ఒక్కసారిగా పోటెత్తారు. తీరంలో పలు సామాజిక వర్గీయులు కార్తిక వనసమారాధనలు నిర్వహించడంతో తీరంలో పర్యాటకుల, భక్తుల రద్దీ మరింత పెరిగింది. మహిళలు తెల్లవారుజామునే సూర్యలంక తీరానికి చేరుకొని తీరం ఒడ్డున పసుపు, కుంకుమ, ఐదురకాల పూలు, పండ్లతో గౌరీదేవి పూజలు నిర్వహించి తీరంలో స్నానాలాచరించారు. స్నానాలు చేసేందుకు, ప్రశాంత వాతావరణంలో పూజలు నిర్వహించేందుకు సూర్యలంక తీరం అనువుగా ఉండటంతో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి పర్యాటకులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. తీరం వెంబడి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తాలుకా పోలీసులు చర్యలు చేపట్టారు. గతంలో ఎన్నడూలేని రీతిలో తీరానికి వాహనాలు భారీస్థాయిలో చేరుకోవడంతో పార్కింగ్ స్థలం వాహనాలతో కిక్కిరిసింది.

కిలోమీటరు దూరంలో నిలిచిన వాహనాలు

ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు తీరానికి చేరుకొని సూర్యనమస్కారాలతో కూడిన స్నానాలు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. ఉదయం 9 గంటల వరకు తీరం వెంబడి వరకు అనుమతించిన వాహనాలు భక్తులు, పర్యాటకుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో వాహనాలను తీరానికి అర కిలోమీటరు దూరంలోనే నిలుపుదల చేశారు. సుమారు 2 లక్షల మేర పర్యాటకులు వచ్చినట్లు అంచనా. రోడ్డుపై కిలోమీటరు దూరంలో నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్‌చేసేందుకు పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచిపోయాయి. స్నానాలనంతరం సూర్యలంక తీరంలో ఏర్పాటుచేసిన తారకేశ్వరస్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో తీరంలోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. తీరం వెంబడి, ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన, గౌరీదేవి పూజలు, పుష్పార్చన కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 6 గంటల వరకు స్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రత్యేక బందోబస్తు

తీరానికి ఒక్కసారిగా భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలతో తీరంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. తీరంలోని వాచ్‌టవర్‌పై నుంచి ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని గమనిస్తూ పర్యాటకులు, భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయి తీరంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న 17 మంది చిన్నారులను సురక్షితంగా కాపాడి వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 6 బోట్లు ఏర్పాటుచేసిన గజ ఈతగాళ్లు తీరంలోనికి ఎవరిని పోనివ్వకుండా ఎప్పటికప్పుడు గస్తీ నిర్వహించారు.


పర్యాటకులతో కిక్కిరిసిన సూర్యలంక తీరం

సాక్షి స్పెల్ బీకి విశేష స్పందన


సాక్షి స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- ఉమ్మడి జిల్లాల నుంచి భారీగా విద్యార్థులు హాజరు
- ఆంగ్ల పదాలకు అర్థాలు తెలుసుకునేందుకు చిన్నారుల ఆసక్తి
- గణితంలోనూ నైపుణ్యాలు పెంచేందుకు మ్యాథ్‌బీ నిర్వహణ


సాక్షి మ్యాథ్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2024-25

SAKSHI MATH BEE

నగరంపాలెం: విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంచేందుకు సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో గుంటూరు శ్యామలానగర్ ఒకటో వీధిలోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షకు విశేష స్పందన లభించింది. సాక్షి మ్యాథ్‌బీ పరీక్షను కూడా విద్యార్థులు ఉత్సాహంగా రాశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు తరలివచ్చారు. వారి వెంట తల్లిదండ్రులు కూడా రావడంతో ప్రాంగణం సందడిగా మారింది. కఠినమైన పదాలకు స్పెల్లింగులు రాసేందుకు పోటీ పడ్డారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను నాలుగు భాగాలుగా విభజించారు. వేర్వేరుగా నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష విద్యార్థుల్లో ఇంగ్లిష్ పదాల ఉచ్చారణతోపాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదం చేసేలా ఉందని ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఇంగ్లిష్ వొకాబులరీ, ప్రొనౌన్సేషన్ వంటి అంశాలు పోటీ పరీక్షలు రాసేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయనే భావన వ్యక్తమైంది. ఆలోచనా తత్వాన్ని ప్రేరేపించి, మేధస్సుకు పదునుపెట్టేలా నిపుణులతో రూపొందించిన ప్రశ్నపత్రంతో స్పెల్‌బీ పరీక్ష ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. పాఠశాల స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి, రీజినల్ స్థాయికి ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజెంట్ స్పాన్సర్‌గా డుకిస్ వాపే, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూలు, రాజమండ్రి వ్యవహరిస్తున్నారు.

ఆంగ్లంపై మక్కువ ఎక్కువ

– షేక్ మహ్మద్ అమీన్, కెనడీ నెక్స్‌జెన్ కిడ్స్ స్కూల్



ఇంగ్లిష్ భాష అంటే చాలా ఇష్టం. ప్రతి పదం అర్థమయ్యేలా చెప్పి, స్పెల్లింగ్ రాయించే విధానం నచ్చింది. ఈ పరీక్ష ద్వారా చాలా కొత్త పదాలు తెలుసుకున్నాను. ఇటువంటి కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

భాషపై పట్టుకు దోహదం

– ఐజాక్, పేరెంట్



ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేందుకు సాక్షి మీడియా గ్రూప్ నిర్వహించిన స్పెల్ బీ పరీక్ష దోహదం చేస్తుంది. ప్రశ్నపత్రం సరళి బాగుంది. పాఠశాలలో చదివే పాఠ్యాంశాలు, సిలబస్ నుంచే ఇవ్వడంతోపాటు కఠిన పదాలకు స్పెల్లింగ్‌లు రాయడం ఎంతో ఆసక్తిగా ఉందని విద్యార్థులు తెలిపారు. వొకాబులరీలో అర్థాలు తెలుసుకునేందుకు అవకాశం కలిగింది.

ఏటా నిర్వహణ అభినందనీయం

– కేజీ సెబాస్టియన్, చైర్మన్, మాంటిస్సోరి స్కూల్, శ్యామలానగర్



విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించేలా సాక్షి మీడియా గ్రూప్ ప్రతి ఏడాది స్పెల్‌బీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయం. కఠినమైన పదాలకు అర్థాలు రాయడంలోనూ, ఇంగ్లిష్‌లో తెలియని పదాలకు అర్థాలను కనుగొనడంలోనూ స్పెల్‌బీ దోహదం చేస్తుంది. ఆధునిక కాలంలో ఆంగ్ల భాషకు ప్రాధాన్యాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థుల మేధస్సుకు పదునుపెట్టేలా ఉంది. ప్రశ్నపత్రంలో ఇచ్చిన పదాలు కఠినంగా ఉండటంతో సకాలంలో స్పెల్లింగులు రాయడంలో విద్యార్థుల ఆలోచనా శక్తి బయటపడుతుంది. కాలానికి అనుగుణంగా భాషా పరిజ్ఞానాన్ని పెంచేందుకు ఇలాంటి పరీక్షల నిర్వహణ అవసరం.

ఆసక్తిగా రాశా

– అర్జున్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్



సాక్షి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ఆసక్తిగా రాశాను. కఠినమైన పదాలకు స్పెల్లింగులు రాయడం బాగుంది. ఈ పరీక్షతో మరింత ఆసక్తి పెరిగింది. గ్రామర్ ప్రాధాన్యం తెలిసింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్పెల్‌బీ పరీక్షకు హాజరయ్యాను. ఇకపైనా ఇలాగే రాస్తాను.

ఎంతో బాగుంది

– ప్రణతి, చరిత, స్టెమ్ స్కూల్



సాక్షి స్పెల్ బీ పరీక్ష రాయడం చాలా బాగుంది. భాషలో కఠిన పదాలకు స్పెల్లింగులు రాయడం ఎంతో ఆసక్తిగా ఉంది. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు చెప్పిన వాటితో పాటు అనేక కొత్త పదాలు ఉన్నాయి. వాటికి అర్థాలు తెలుసుకుని, రాయడం ఎంతో ఉపయోగకరం.

క్లుప్తంగా

రేపు సాహిత్య విమర్శ పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక సాహిత్య విమర్శ పురస్కారాల ప్రదాన సభను ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు డాక్టర్ సీహెచ్ సుశీలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆవరణలో ఉన్న అన్నమయ్య కళావేదికపై కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు హాజరవుతారని చెప్పారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, ప్రముఖ రచయిత విమర్శకులు, డాక్టర్ జీఎస్ చలంకు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు.

ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ బూసిరెడ్డి


అవార్డులతో డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి అవార్డు అందుకున్నారు. 2023–24 సంవత్సరానికిగాను గుంటూరు బ్రాంచ్‌ను అన్ని విభాగాలలో ఉత్తమ పనితీరు కనపరిచేలా తీర్చిదిద్దినందుకు డాక్టర్ బూసిరెడ్డికి ఈ అవార్డు దక్కింది. గుంటూరు మెడికల్ కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఐఎంఏ రాష్ట్ర స్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌ల చేతుల మీదుగా డాక్టర్ బూసిరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శితోపాటు గుంటూరు బ్రాంచ్‌కు ఉత్తమ సేవా విభాగం, విపత్కర పరిస్థితుల్లో ఉన్నవారికి ఆపన్న హస్తం (ఫ్లడ్ రిలీఫ్) అందించినందుకు రెండు పతకాలు లభించాయి. ఐఎంఏ రాష్ట్ర నేతలు మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్ బూసిరెడ్డి అనేక కార్యక్రమాలను చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని అభినందించారు.

రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌కు 120 మంది


పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుడు లాల్ వజీర్

గుంటూరు వెస్ట్(క్రీడలు): రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా పోటీలు ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగాయి. రాష్ట్ర అధక్షుడు లాల్ వజీర్ మాట్లాడుతూ.. మొత్తం ఈ పోటీల్లో 200 మంది పాల్గొన్నారన్నారు. వీరిలో 120 మంది రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర పోటీలు ఈ నెల 28, 29 తేదీల్లో ఎన్టీఆర్ స్టేడియంలోనే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ నజీర్, కోటేశ్వరరావు, లక్ష్మి, నవమి, ఫ్లోరా, రామకృష్ణ పాల్గొన్నారు.

అలా పిలిస్తే నా లక్ష్యం నెరవేరినట్టే!

- ప్రముఖ బాల నటి మోక్ష ఆశాభావం
- పలు అంశాల్లోనూ మంచి పట్టు
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఎదుగుదల


తల్లి శంకరీ రాజ్యలక్ష్మితో మోక్ష



తెనాలి: మోక్ష... టీవీ షో, సీరియల్, వెబ్ సిరీస్‌ల ప్రేక్షకులకు పరిచయం అక్కరలేని పేరు. మూడున్నరేళ్లకే కెమెరా ముందు కనిపించింది. 13 ఏళ్లకు బాలనటిగా స్టార్‌డమ్‌ను తెచ్చుకుంది. తన అద్భుత నటనతో పద్మమోహన అవార్డు, జాతీయ ప్రతిభా పురస్కార్ సహా 19 అవార్డులను గెలుచుకుంది. ఇటీవల బాలల దినోత్సవంలో భాగంగా జరిగిన వివేక కల్చరల్ ఫెస్ట్‌లో బాల అతిథిగా తన మాట, ఆట, పాటతో సందడి చేసింది. ఈ నేపథ్యంలో పలుకరించిన 'సాక్షి'తో బోలెడు కబుర్లు పంచుకుంది. వివరాలు ఆమె మాటల్లోనే...

'' నా పూర్తి పేరు మోక్ష విజయ రామలక్ష్మి. తల్లిదండ్రులు సురేష్‌బాబు, శంకరీ రాజ్యలక్ష్మి. స్వస్థలం రాజమహేంద్రవరం. మూడున్నరేళ్ల వయసులో ఓ ఫంక్షనుకు తీసుకెళ్లారు. అక్కడే టీవీ షోకు ఆడిషను జరుగుతోంది. నన్ను చూసి బాగుందనటంతోపాటు ఆడిషనులో కూర్చోబెట్టారు. సెలెక్టు చేసుకున్నారు. అందరికీ టికెట్లు పంపి, హైదరాబాద్‌కు ఆహ్వానించారు. అలా ఊహ తెలీని వయసులో 'పిల్లలు పిడుగులు' టీవీ షోలో నటించాను. తర్వాత అవకాశాలు వరుసకట్టాయి.

హైదరాబాద్‌కు వచ్చేశాం..

నాన్నకు ఊరిలో ఉన్న అట్టల ఫ్యాక్టరీని లీజుకిచ్చి హైదరాబాద్‌కు వచ్చేశారు. అమ్మ ఇక్కడే 'అమెజాన్'లో వర్క్ చేస్తోంది. పలు టీవీ ఛానళ్లలో 'అయస్కాంతం', 'కోడలు', 'సూర్యకాంతం', 'గుండమ్మకథ', 'శుభస్య శీఘ్రం', 'నువ్వే కావాలి' సీరియల్స్, 'పిల్లలు పిశాచాలు'తో ఆరంభించి 'డ్రామా జూనియర్స్', 'ఎక్స్‌ట్రా జబర్దస్త్' వంటి టీవీ షోలు, 'మ్యూజిక్ స్కూల్', 'హీరో' సినిమాలు, మరికొన్ని వెబ్ సిరీస్‌లలో నటించాను. కొన్ని కంటిన్యూ అవుతున్నాయి.

విభిన్న కళల్లోనూ ప్రతిభ

నటనే కాదు.. రచన, చిత్రలేఖనం, డ్యాన్స్, యాంకరింగ్ నాకిష్టం. సినీనటులు శ్రేయ, నాని, అనసూయ ఈ విషయం తెలిసి ప్రశంసించారు. ప్రముఖ యాంకర్ సుమ, 'నా తర్వాత నువ్వే మోక్ష' అనటం సంతోషమేసింది. రచనంటే ఇష్టమని చెప్పాకదా... నేను మూడు కథలు రాసుకున్నా. అందులో రెండు షార్ట్ ఫిలిమ్స్, మరోటి వెబ్ సిరీస్. శివుడికి సంబంధించిన భక్తిపూర్వక కథనం. నాకొచ్చిన కలను డెవలప్ చేసి కథ, స్క్రిప్టు సిద్ధం చేశా. నా దర్శకత్వంలోనే తీయాలని ఆశ పడుతున్నా. తగిన ప్రొడ్యూసర్ ముందుకొస్తే వెబ్ సిరీస్ తీసి, అతి పిన్న దర్శకురాలు అనిపించుకోవాలని ఆశిస్తున్నా.

కథానాయిక కావాలనేదే లక్ష్యం

పెద్దయ్యాక హీరోయిన్‌గా నటించాలనేది నా మరో డ్రీమ్. హైదరాబాద్‌లోనే తొమ్మిదో తరగతి చదువుతున్నా. నెలలో రెండు వారాలు బడికి, రెండు వారాలు షూటింగులకు కేటాయించుకున్నా. ఎక్కడకు వెళ్లిన బుక్స్ వెంటే ఉంటాయి. షూటింగ్ గ్యాప్‌లో చదువుకుంటా. పరీక్షల్లో 90 శాతం పైగానే మార్కులు వస్తుంటాయి. కూచిపూడి నాట్యం నేర్చుకుంటున్నా. నా కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ వచ్చి స్థిరపడ్డారు. ఎంతో త్యాగం చేశారు. చదువు, నటన, రచన... అన్నింటిలోనూ గెలిచి, నా తల్లిదండ్రులను గెలిపిస్తూ ఉండాలనేది నా ఆశయం.

టాలెంట్ ఉంటే బోలెడు వేదికలు

టీవీ, ఓటీటీ ప్లాట్‌ఫాంలు వచ్చాక చిన్న పిల్లల్నుంచి పెద్దల వరకు నటన, సాంకేతిక నైపుణ్యంలో ఎన్నో అవకాశాలున్నాయి. టాలెంట్ ఉన్నవాళ్లు అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాణించవచ్చు. పిల్లలు చదువుతో పాటు ఏదో ఒక కళలో నైపుణ్యం సాధించాలనేది నా భావన. అప్పుడు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారని చెబుతాను. అందుకు నేనే నిదర్శనం. తెనాలి, రాజమహేంద్రవరం అంటే నాకెంతో ఇష్టం. ఎందరో కళాకారులు ఇక్కడ్నుంచి వచ్చారు. మహానటి సావిత్రి నాకు ఆదర్శం. ఆమె సినిమాలు ఇప్పటికీ ఎవర్‌గ్రీనే కదా!''

'రాజధానిలో పేకాట'పై పోలీసు ఉన్నతాధికారుల ఆగ్రహం

మూమూళ్ల వ్యవహారం నిగ్గు తేల్చేందుకు చర్యలు

తాడికొండ: రాజధాని తుళ్లూరులో అనధికారికంగా కొనసాగుతున్న పేకాట దందా వ్యవహారంపై సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'పేకాటకు రాజధాని' కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. నిజాలు నిగ్గు తేల్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. పేకాట ఆడిస్తున్న నిందితులెవరు, ఈ వ్యవహారంలో ఇంటి దొంగల పాత్ర ఎంత మేరకు ఉంది, ఎవరెవరు ఉన్నారనే దానిపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే కొంతమంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా ఓ అధికారి పాత్ర ఉన్నట్లు ఇప్పటికే వెల్లడైనట్లు తెలిసింది. ఆటకు వస్తున్న వ్యక్తులు ఏ ప్రాంతాలకు చెందిన వారు, ఎవరెవరు అనే దానిపై కూడా కూపీ లాగారు. వారిని కూడా విచారణకు పిలిపిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ జరిగితే కానీ అసలు నిందితులు, వారికి సహకరిస్తున్న ఇంటి దొంగలు తేలే అవకాశం ఉంది.

పలు రైళ్లు రద్దు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని పలు రైళ్లు సాంకేతిక కారణాల నేపథ్యంలో ఈనెల 25వ తేదీన రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు–విశాఖపట్నం(17239) రైలు ఈనెల 25న రద్దు చేసినట్లు తెలిపారు. విశాఖపట్నం–గుంటూరు(17240) రైలు ఈనెల 26న రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించి సహకరించాలని తెలియజేశారు.

అధ్యయన కేంద్ర నిర్వాహకుడిపై చర్యలు

ఏఎన్‌యూ దూర విద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్


ఆచార్య డి. రామచంద్రన్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పరీక్షలు రాయనీయకుండా బాపట్ల జిల్లాలోని ఒక అధ్యయన కేంద్రం నిర్వాహకుడు అక్కడి విద్యార్థులను అడ్డుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆదివారం దూర విద్యా కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ తెలిపారు. దీనిపై విచారణ జరిపి ఆ స్టడీ సెంటర్ నిర్వాహకునిపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కూడా ఆ అధ్యయన కేంద్రంపై అనేక ఆరోపణలు రావడంతో అక్కడ పరీక్షా కేంద్రాన్ని రద్దుచేసి వేరే కళాశాలలో నిర్వహణకు నిర్ణయించామన్నారు. సుమారు 250మంది విద్యార్థులు ఆ కేంద్రంలో పరీక్షలు రాయాల్సి ఉండగా, ఐదుగురు మాత్రమే హాజరవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం పరీక్షలకు హాజరు కావద్దని, వచ్చే సంవత్సరం తమకు పరీక్షా కేంద్రం అనుమతి వస్తుందని, అప్పుడు అందరికీ అనుకూలంగా పరీక్షలు రాయిస్తానని విద్యార్థులను పక్కదోవ పట్టిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు విద్యార్థులకు మెసేజ్‌లు పంపుతున్నట్లు ఫిర్యాదుల్లో తెలిపారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అసత్య వార్తలు వ్యాప్తి చేస్తున్న వారిపై చర్యలు

ఏలూరు దగ్గర్లోని కుక్కునూరు దూర విద్య కేంద్రంలో పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని వెలువడిన వార్తా కథనాలలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన వెల్లడించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరిశీలకుడు అక్కడే ఉంటున్నారని, పరీక్షల నిర్వహణ సజావుగా సాగుతోందని చెప్పారు. పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన స్క్వాడ్ ఈ మేరకు ధ్రువీకరించిందన్నారు. సమాధాన పత్రాలను భద్రపరచడానికి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక నోడల్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేసినట్లు రామచంద్రన్ తెలిపారు. ఇదే అంశంపై కుక్కునూరు పోలీస్ స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ వివరణ కూడా ఇచ్చారన్నారు. ఏఎన్‌యూ దూర విద్యాకేంద్రం ప్రతిష్టను దెబ్బతీసే విధంగా నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నారని, దీనిపై త్వరలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణ అవసరం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పోరాడాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ప్రభుత్వ విద్య ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను ఆదివారం గుంటూరులోని ఎన్‌జీవో హోంలో నిర్వహించారు. శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ఎన్‌జీవో హెం వరకు ఉపాధ్యాయులు ర్యాలీ తీశారు. మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాతోపాటు ఎస్‌టీఎఫ్ఐ, యూటీఎఫ్ జెండాలను సీనియర్ నాయకులు కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, ఎస్.తాండవకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ... దేశంలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత 30 ఏళ్లలో విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. దీనిని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం తెచ్చిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవో, ప్రాథమిక తరగతుల విలీనం అందులో భాగమేనన్నారు. కూటమి ప్రభుత్వం జీవో 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇంత వరకూ చేయలేదన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రైవేటీకరణ విధానాలే అమలు చేస్తున్నాయన్నారు. ఇటీవల మండలి సమావేశాల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయి పడిన రూ.22 వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలన్నారు. యూటీఎఫ్ 50 ఏళ్ల ఉద్యమ చరిత్ర అనేక అనుభవాలు నేర్పిందని, పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోగలమని చెప్పారు. ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో పనిచేయాలన్నారు. 2007 నుంచి ఇప్పటి వరకూ శాసనమండలిలో పీడీఎఫ్ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తోందన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమ నిర్మాణంలో గుంటూరు జిల్లా సీనియర్ నేతల పాత్ర ఎంతో ఉందన్నారు. విలువలు, త్యాగాలతో సంఘం నిర్మితం అయ్యిందన్నారు. పాఠశాలలు మూత పడుతున్నాయని, విద్యార్థులు ఉంటేనే ఈ వ్యవస్థ ఉంటుందన్నారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.జోజయ్య మాట్లాడుతూ స్వర్ణోత్సవాల వెలుగులో రాబోయే కాలంలో ఉపాధ్యాయులు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఏ కుసుమ కుమారి, సీనియర్ నాయకులు ఎస్‌తాండవకృష్ణ, కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, ఎబిటీయూ జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం కీలకం


అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు, అతిథులు

నగరంపాలెం: రాష్ట్రంలో కళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పద్మశ్రీ పురస్కారగ్రహీత సి.వి.రాజు అన్నారు. డాక్టర్ పట్టాభి కళాపీఠం 14వ వార్షికోత్సవ సభ బ్రాడిపేట 2/7వ అడ్డరోడ్డులోని సీపీఎం జిల్లా కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. కళాపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సి.వి.రాజు మాట్లాడుతూ కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ సమరం మాట్లాడుతూ కళలు అజరామరమని అన్నారు. కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. చింతామణి పాత్ర పోషిస్తున్న జి.రత్నశ్రీ (రంగస్థలం) మాట్లాడుతూ నాటకాలు విజ్ఞానానికి కూడా నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం ఎ.మానస (నాట్యం), డాక్టర్ ఎల్.వరలక్ష్మి (పర్యావరణం), డాక్టర్ జి.సమరం, డాక్టర్ బి.అంజయ్య (వైద్యం), జి.రత్నశ్రీ (రంగస్థలం), డాక్టర్ కేవీ అనంతశయనం(సంగీతం), డాక్టర్ వజ్రగిరి జస్టిస్ (చిత్రలేఖనం), డాక్టర్ ఎంబీడీ శ్యామల (కవిత్వం), డాక్టర్ సీహెచ్ స్వరాజ్యాలక్ష్మి (విద్య)లకు పట్టాభి అవార్డులు, డాక్టర్ ఝాన్సీలక్ష్మీకి స్త్రీశక్తి అవార్డు ప్రదానం చేశారు. అనంతరం శ్రీసాయి మంజీర కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థినుల నృత్య ప్రదర్శన, మరియదాసు పాటల రికార్డింగ్ డాన్స్, కృష్ణ ఫ్లూట్‌పైఆలాపించిన గీతాలు అలరించాయి. డాక్టర్ జగత్‌శ్రీనివాస్, డాక్టర్ ఎస్‌బీఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు


కడప, చిత్తూరు మధ్య పోటీ


ప్రకాశం, కడప మధ్య పోటీ

కారెంపూడి: 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14 బాల బాలికల ఖోఖో పోటీలు రెండో రోజు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. బాలుర విభాగంలో చిత్తూరు, గుంటూరు, విశాఖపట్నం, ప్రకాశం జిల్లాల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. అలాగే బాలికల విభాగంలో చిత్తూరు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరాయి. చిత్తూరు జిల్లా జట్టు ఈస్ట్ గోదావరిపై 10–6 తేడాతో గెలిచింది. అలాగే గుంటూరు జిల్లా జట్టు కర్నూలు జట్టుపై 10–7 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. విశాఖపట్నం జట్టు విజయనగరం జట్టుపై 9–8 తేడాతో, అలాగే ప్రకాశం జిల్లా జట్టు కడపపై 11–6 పాయింట్ల తేడాతో విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరాయి. బాలికల విభాగంలో.. చిత్తూరు జిల్లా జట్టు ప్రకాశంపై 10–6 తేడాతో, విజయనగరం జిల్లా జట్టు కడపపై 8–4 పాయింట్ల తేడాతో, శ్రీకాకుళం జిల్లా జట్టు నెల్లూరు జట్టుపై 9–3 తేడాతో, విశాఖపట్నం జిల్లా జట్టు అనంతపురంపై 9–8 పాయింట్ల తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయని జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్ వెల్లడించారు. బాలుర విభాగంలో సెమీ ఫైనల్స్ చిత్తూరు జిల్లా గుంటూరు జిల్లా జట్ల మధ్య, అలాగే విశాఖపట్నం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్ల మధ్య ఆదివారం రాత్రి జరగనున్నాయని, అలాగే బాలికల విభాగంలో సెమీ ఫైనల్స్ చిత్తూరు జిల్లా విజయనగరం జిల్లా జట్ల మధ్య, అలాగే శ్రీకాకుళం జిల్లా విశాఖపట్నం జిల్లా జట్ల మధ్య జరుగుతాయని తెలిపారు. సోమవారం ఫైనల్స్ జరుగుతాయని వివరించారు.

ఎన్‌ఈసీలో ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్



నరసరావుపేట రూరల్: డాక్టర్ విజయనిర్మల మెమోరియల్ ఆధ్వర్యంలో 38వ సౌత్ ఇండియా ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌ను నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది క్రీడాకారులు, కళాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సినీనటుడు నరేష్ ప్రారంభించారు. కుంగ్‌ఫూ, కరాటే, కర్రసాము, యోగా, భరతనాట్యం పోటీలను నిర్వహించారు. డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ సంప్రదాయ, ఆత్మ రక్షణ క్రీడలు, కళలను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్న సినీ నటుడు నరేష్‌ను అభినందించారు. విద్యార్థులు కేవలం చదువు మీదే కాకుండా కళలు, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. సినీ నటుడు నరేష్ మాట్లాడుతూ తన తల్లి విజయనిర్మల జ్ఞాపకార్థం ఏటా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మార్షల్ ఆర్ట్స్‌కు ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎంఎన్ రవికుమార్, రిటైర్డ్ ఎస్పీలు డాక్టర్ సిహెచ్ చక్రపాణి, కె.రాజశిఖామణి, కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మైలవరం: కుటుంబ కలహాలతో పురుగుమందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం నాగల గ్రామానికి చెందిన రావూరి మధుబాబు(37)తో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చిన నందిగామ గ్రామానికి చెందిన రాజగిరి రమణతో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి సంతానం. మధుబాబు కూలి పనులు చేసుకుంటూ చెడు వ్యసనాలకు బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తుండటంతో తన పిల్లలను తీసుకుని ఇటీవల చిన నందిగామలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో భార్యకు నచ్చ చెప్పి తీసుకువెళ్లేందుకు వచ్చిన మధుబాబు శుక్రవారం సాయంత్రం తాను వెంట తెచ్చుకున్న పురుగు మందును కుటుంబ సభ్యులు చూస్తుండగానే తాగాడు. తక్షణమే కుటుంబ సభ్యులు మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మధుబాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆసుపత్రిని సందర్శించిన ఉత్తరాధికారి


ఆసుపత్రిలో దీపం వెలిగిస్తున్న శ్రీ విధుశేఖర భారతి మహా స్వామి

పెదకాకాని: శ్రీ శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ విధుశేఖర భారతి మహా స్వామి విజయ యాత్ర మహోత్సవంలో భాగంగా శ్రీ శృంగేరి శారదా పీఠం చారిటబుల్ ట్రస్టుకు చెందిన శ్రీ రాజరాజేశ్వరి హాస్పిటల్‌ను ఆదివారం సందర్శించారు. ఆసుపత్రి అడ్మిన్ ఇన్‌చార్జి వి.హరిరాజ్ శర్మ, వేద పండితులు తొలుత పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ధన్వంతరి విగ్రహానికి పూలమాల వేసి, దీపం వెలిగించారు. అనంతరం డయాబెటిక్, ఫిజియోథెరపీ, మల్టీ స్పెషాలిటీ యూనిట్లను పరిశీలించారు. హాస్పటల్ సిబ్బంది, వైద్యులు, రోగులకు దైవాశీస్సులను అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మిన్ ఇన్‌చార్జి, పోలిశెట్టి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి హరిరాజ్ శర్మ, పోలిశెట్టి శ్యాంసుందర్, శృంగేరి శంకరమఠం సీఈవో మురళి పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు పేలి ఒకరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- దీపం మంటలు అంటుకుని ప్రమాదం


అమ్మిశెట్టి తులసీనాథ్ (ఫైల్)


దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి

పెదకాకాని: గ్యాస్ సిలిండర్లు పేలిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ గ్రామానికి చెందిన అమ్మిశెట్టి శ్రీనివాసరావు కుటుంబం ఆదివారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంట్లో దీపారాధన, పూజలు చేసింది. తర్వాత గ్రామ శివారులోని నాగేంద్రస్వామి పుట్ట వద్దకు అందరూ వెళ్లారు. పూరిల్లు ఒక్కటే అయినప్పటికీ రెండు పోర్షన్‌లు ఉన్నాయి. రెండవ పోర్షన్‌లో ఆయన కుమార్తె నల్లూరి సుజాత నివసిస్తోంది. ప్రమాదవశాత్తూ ఇంట్లో వెలిగించిన దీపాల కారణంగా మంటలు వ్యాపించాయి. పూరిల్లు అగ్నికి ఆహుతి అవుతున్న క్రమంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌లు రెండు ఒకదాని తరువాత మరొకటి పేలడంతో చుట్టుపక్కల వారు కూడా దగ్గరకు రావడానికి భయపడ్డారు. మంటలు ఆర్పేందుకు కూడా ముందుకు రాలేదు. ఇంటిలో ఉన్న మరొక గ్యాస్ సిలిండర్ పేలి దాని ముక్కలు తగిలి నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు అమ్మిశెట్టి తులసీనాథ్, గుంటముక్కల పరమేష్, గుంటముక్కల మల్లికార్జున, గుంటముక్కల వీరాంజనేయులును స్థానికులు చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. తలకు తీవ్రగాయాలైన అమ్మిశెట్టి తులసీనాథ్(37) మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పెదకాకాని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. అమ్మిశెట్టి తులసీనాథ్ అప్పటి వరకూ పొలానికి గడ్డిమందు వేసి ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న అత్త ఇంటికి వచ్చాడు. వారి ఇంట్లో గ్యాస్ కనెక్షన్ తొలగించాడు. ఇంజిన్ శుభ్రం చేసి రోడ్డుపైకి చేరే సమయంలో ఈ దుర్ఘటన సంభవించింది. ఆయనకు భార్య లక్ష్మీరుపతమ్మ, ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేత్రదానం అభినందనీయం


కళ్లను దానం చేసిన ఏసు(ఫైల్)

చిలకలూరిపేట(యడ్లపాడు): నేత్రదానం మరో రెండు జీవితాలకు వెలుగును పంచుతుందని సీపీఐ నాయకుడు నాయుడు శివకుమార్ తెలిపారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన బొంతా ఏసు(58) అనారోగ్యంతో శనివారం గుంటూరు సమగ్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆయన కళ్లను ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఆదివారం ఏసు భౌతికకాయన్ని గ్రామానికి తీసుకువచ్చారు. సీపీఐ నాయకులు నాయుడు శివ కుమార్, ఆరాధ్యుల రామకృష్ణ, మూసాబోయిన వెంకటేశ్వర్లు తదితరులు ఏసు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.